# 'ఎచ్చట పుట్టె నచ్చటి కేగుట నైజము ప్రాణికోటికిన్'

**నరుని జీవితంబు నల్లుల మంచంబు**
**పుడమి నొడలు రోగములకు కొంప**
**సుఖము చూడబోవ శూన్యమో మనిషికి**
**మరువబోకుడిట్టి మంచిమాట.**

ప్రేమస్వరూపులారా!

విలువైన మానవ జీవితమును, విలువైన మానవతా విలువలను మానవుడు గుర్తించుకొనలేక మాణిక్యమువంటి జీవితాన్ని మసిబొగ్గునకు అమ్ముకుంటున్నాడు. నిజముగా మానవుడు తన తత్వమును, తన స్వరూపమును, తన స్వస్థానమును మరచిపోవటంచేతనే జీవితమునకు యింతటి దుర్గతి ఏర్పడుతూ వచ్చింది. VC చెప్పాడు. What is the purpose of life అని. మానవుడు తన స్వరూపము తెలుసుకోటం, స్వస్థానము చేరటమే purpose of life. 'ఎచ్చట పుట్టె నచ్చటి కేగుట నైజము ప్రాణికోటికిన్'. మరొక స్థానమునకు కాదు. అదియే మానవుని లక్ష్యము. అదియే మానవుని గమ్యము. దీనిని మరచి జీవితములో ఏదో సుఖశాంతులను అనుభవించాలని, ఆస్తిపాస్తులనభివృద్ధి గావించాలని, ఆలుబిడ్డలను పోషించాలని, కీర్తిప్రతిష్ఠలను సాధించాలని, తెల్లవారి మొదలు రాత్రి పరుండినంతవరకు అనేక విధములుగా శ్రమిస్తున్నాడు మానవుడు.

**మానవుడు తన స్వస్థానమునకు చేరాలి**

సాయినాథ్‌కూడా చెప్పాడు. తాను వచ్చిన స్థానమునకు తాను చేరిపోవాలి. తన గమ్యము తాను చేరాలి. వచ్చిన దారిని గుర్తుంచుకొనడమే మానవుని ప్రధాన లక్ష్యము. ఎక్కడికి పోవాలని ప్రశ్న వేసుకున్నప్పుడు, ఎక్కడనుండి వచ్చావో, అక్కడికే పోవాలి. మరొక ప్రదేశమునకు పోవుట మానవుని సరైన మార్గముకాదు. అసలు నీవు ఎవరు? ఇదియే

sri sathyasai vachanamrutam

'ఈశావాస్యమిదం జగత్'. ఈ జగత్తంతా భగవంతుని నివాసమే! బృహత్స్వరూపుడు కనుకనే ఇతనికి 'బ్రహ్మ' అని పేరు వచ్చింది. ఎక్కడ చూచినా వ్యాపించే తత్త్వమే అతని ప్రధాన లక్షణము. తానులేని స్థానముకానీ, తనదికాని పేరుగానీ ఈ జగత్తులో లేదు. నీయందు, వారియందు, వీరియందు, అందరియందు, ఉన్నది ఒక్కటే! 'ఈశావాస్యం'. అయితే ఇట్టి ఏకత్వమును అందరూ అంతగా అభిలషించరు. దీనిని పురస్కరించుకొనియే ఉపనిషత్తులు 'ఏకోహం బహుస్యాం' అన్నాయి. ఉన్నది ఒక్కటే! కానీ అదే అనేకంగా రూపొందినప్పుడు మనకు ఆనందము చేకూరుతుంది. ఉదాహరణకు, ఒక నూరు రూపాయలనోటు మన చేతిలో ఉంటే అంత ఆనందము కలగదు. కాని అదే ఒక రూపాయినోట్లు నూరు ఉంటే ఎంతో ఆనందముగా ఉంటుంది. కృష్ణుడుకూడా 'సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ' అన్నాడు. 'అన్నీ నాకు అర్పితం చేయి. నేను నిన్ను చూచుకుంటాను' అన్నాడు. ఎట్లా? దీని విలువ ఏమిటి? ఒరే పిచ్చివాడా! జగత్తులో అనేక రకములైన చింతలుంటున్నాయి.

**పుట్టుట ఒక చింత భూమి నుండుట చింత**
**సంసార మొకచింత చావు చింత**
**బాల్యమంతయు చింత వార్ధక్య మొకచింత**
**జీవించు టొకచింత చెడుపు చింత**
**కర్మలన్నియు చింత కష్టంబు లొకచింత**
**సంతస మొకచింత వింత చింత**
**సర్వచింతలు బాపెడు సాయి భక్తి**
**కొనుడు ఇకనైన జనులార కోర్కెమీర**

మానవ జీవితమంతా చింతలతోకూడినది. దీనికి ఏమాత్రము విలువలేదు. పిచ్చివాడా! ఈ చింతలలో నీవు మునిగి, ఈ చింతల కట్టెను నీ తలపై పెట్టుకొని ఏ విధంగా మోయగలవు జీవితాన్ని? ఏ విధంగా నీవు సాధించగలవు? ఏ విధంగా నీ జీవిత మార్గములో నడవగలవు?

**చింతలన్నీ భగవంతునికి అర్పించి శరణాగతి చెందాలి**

sri sathyasai vachanamrutam

ఒక్కొక్క చింత ఒక్కో నయాపైస వంటిది. ఎందుకంటే ఏ చింతలూ శాశ్వతమైనవికాదు. ఇప్పుడు ఒక చింతవస్తే క్షణములో అది కదలిపోయి మరొక చింత వచ్చేస్తుంది. కాబట్టి దీనికి విలువయే లేదు. What is the shape of worry? It is mentally created fear only. మనసే చంచలమైనది. దీని కల్పనతోకూడిన చింతలు ఎంతవరకు ఉంటాయి? కనుక్కో నాయనా! ఆ చిల్లర అంతా నాకు యిచ్చేయి. ఒక్క రూపాయికి నూరునయాపైసలు. నూరు రూపాయలకు 10,000 నయాపైసలు. ఈ 10,000 నయాపైసలు మూటకడితే పెద్ద భారముగా ఉంటుంది. దీన్ని ఏ విధంగా మోయగలవు? నీచేతకాదు. ఆ 10,000 నయాపైసలు నాకియ్యి. ఇదిగో! నూరు రూపాయలనోటు నీకిస్తున్నాను. లైటుగా ఉంటుంది. దాచుకో! భారములేకుండా ఉంటుంది. భద్రముగాకూడా ఉంటుంది. ‘ఈ మూట నీవు దాచుకోటం కష్టము. మోయటం మరింత కష్టము. భద్రత అసలే ఉండదు. కాబట్టి అవి నాకిచ్చివేయి. నన్ను శరణుజొచ్చు’. భగవంతుడు యింత సూక్ష్మంగా ప్రబోధిస్తూ వచ్చాడు. అందరియందు ఉండిన భగవంతుడు ఒక్కడే! అయితే ‘మా కర్తవ్యములు ఏమి చేయాలి? మా duties ఉంటున్నాయి కదా! ధనేషణ, దారేషణ, పుత్రేషణ యింకా ఎన్నో ఈషణలున్నాయి’ అని నీవు అడుగవచ్చు. వీటిని వదలనక్కరలేదు. నీ కర్తవ్యము నీవు నిర్వర్తించుకో! ఎట్లా? నీవు ఒక డ్రామాలో ఒక తండ్రిగా చేస్తున్నావు. నీకు ఒక కుమారుడున్నాడు ఆ కుమారునికి జబ్బు చేసింది. నీవు బాధపడుతున్నావు. కానీ నిజంగా చూస్తే నీవు తండ్రికాదు, నీకు కొడుకూ లేడు. వాడు జబ్బుతోనూ లేడు. నీవు ఏడ్చుటంలేదు. ఇవన్నీ డ్రామాలో acting. నీవు ఏడ్చే సమయంలోకూడా ‘నేను ఫలాన boy, ఫలాన క్లాసు చదువుతున్నాను, వాడు నా కొడుకు కాదు ఫలాన క్లాసు boy’ అని ఆలోచిస్తున్నావు. స్టేజిపై నీ acting correct గా చేయి. ఎంత act చేస్తున్నా నీ పేరు నీవు మర్చుటం లేదు. నాగయ్య త్యాగయ్య వేషము వేశాడు. ‘నేనెందు పోదురా’ అని పాడుతున్నాడు. త్యాగయ్యవలె పాడుతున్నాడు. కానీ అతను నాగయ్య, త్యాగయ్య కాదు. ప్రేక్షకులకంతా అతను కేవలం త్యాగయ్యనే! స్టేజి వెనుకకుపోతే ‘ఏమి నాగయ్యా! చాలా బాగా act చేశావ’ంటారు. నిజానికి అతడు స్టేజిపైనా నాగయ్యనే, స్టేజివెనుక నాగయ్యనే! పాడేది నాగయ్యే, act చేసేది నాగయ్యే! కానీ పేరు different గా ఉంటున్నాది. అదే విధముగా ప్రతి వ్యక్తి acting ప్రత్యేకంగా

sri sathyasai vachanamrutam

చేస్తున్నాడు. ఆ రూపనామములు వేరువేరుగా ఉంటున్నాయి. కానీ అతని నిజనామము 'ఆత్మ'యే! దానిని మరువకూడదు. దానిని నిరంతరము చింతిస్తూ నీవు ఏమి acting అయినా చేయి. ఇదే జీవితమునకు సరైన ఆదర్శము, ఆనందము. ఒక్కొక్కరు 'నేను భగవంతునకు సర్వము అర్పితము చేశాను, శరణాగతి పొందాను, కానీ నాకు ఎందుకింకా కష్టములు తీరలేదు. నాకు ఎందుకింకా ఈ బుద్ధులు రావటము? నన్నెందుకీ బాధలు పెట్టటము?' అని వాపోతారు. పిల్లలు సూక్ష్మంగా గుర్తించాలి. నిజంగా నీవు శరణాగతుడై ఉంటే ఈ కష్టాలు నీకెందుకు వస్తాయి? ఈ భావాలు నీకు ఎందుకు వస్తాయి? ఈ భావాలు నీవు తలవనే తలవవు. ఇవి నా కష్టములని విచారించనే విచారించవు. కనుక, నీవు నిజంగా శరణాగతుడవు కాలేదన్నమాట! శరణాగతి అయితే ఈ చింతనకు నీవు care చేయవు. అదే విధముగా దైవమే నీలో ఉండినప్పటికిని దైవము నీలో ఉన్నాడనే విశ్వాసము లేనప్పుడే ఈ బాధలన్నీ నిన్ను చుట్టుముట్టుతాయి.

**మనస్సుయొక్క ప్రభావమే అన్ని అవస్థలకు మూలకారణము**

మానవుడు పరిస్థితుల ప్రభావమును పురస్కరించుకొని తనయొక్క స్థితిగతులను సమయస్ఫూర్తిగా విచారించి భగవత్తత్త్వమును విచారించినపుడు భగవంతుని రూపనామములు వేరువేరుగా కనిపిస్తాయి. అయినప్పటికి భగవంతుడు ఒక్కడే! క్రిష్టియన్సు చెప్పనీ, ముస్లిమ్సు చెప్పనీ, పర్షియన్సు చెప్పనీ, హిందువులు చెప్పనీ ఎవరు చెప్పినా దైవము ఒక్కడే! కానీ ఆయా సమాజములయొక్క నిబంధనలు, సిద్ధాంతములు పురస్కరించుకొని వేరవేరు రూపనామములుగా మనం అనుభవిస్తున్నాము. ఒక బ్రాహ్మణుడున్నాడు. ఆయన వంటయింట్లో వంట చేస్తున్నాడు. ఆయన చేసే పనిని పురస్కరించుకొని అతను 'వంట బ్రాహ్మణుడు' అంటున్నాము. ఒక గుడిలోపల పూజ చేస్తున్నాడు. అతను 'పూజారి బ్రాహ్మణుడు'. ఎందుకు ఇక్కడ వంట బ్రాహ్మణుడు, అక్కడ పూజారి బ్రాహ్మణుడు, బ్రాహ్మణుడు బ్రాహ్మణుడే కాదా? కాదు, ఇక్కడ చేస్తున్న పని వంటపని, అక్కడ చేస్తున్న పని పూజపని. అదే బ్రాహ్మణుడు మధ్యాహ్నం పంచాంగము ముందు పెట్టుకొని అందరికి చెబుతున్నాడు. అప్పుడు అతనిని 'పంచాంగ బ్రాహ్మణుడు' అంటారు. అదే బ్రాహ్మణుడు ఆఫీసుకు పోతాడు. అప్పుడు

sri sathyasai vahini amrutam

'అధికార బ్రాహ్మణుడ'ంటారు. తాను చేసే పనిని పురస్కరించుకొనియే పేర్లు వస్తున్నాయి. అదే విధముగా ఈ జగన్నాటకరంగమందు వారు వారు నటించిన నటనలకు, వారి వారి పూర్వ జన్మసుకృతములకు తగిన పేర్లు అక్కడ వస్తుంటాయి. నిజముగా ఇవన్నీ భ్రమలే తప్ప సత్యము ఒక్కటీకాదు. మనస్సుయొక్క ప్రభావమే ఈ అవస్థలకు మూలకారణము. 'ఇది కేవలము భ్రమ' అని తెలుసుకుంటే బ్రహ్మ సాక్షాత్కరిస్తాడు. లేక 'నేనే బ్రహ్మ' అనుకుంటే భ్రమ పారిపోతుంది.

**ఎక్కడనుండి వచ్చావో అక్కడికి చేరడమే జీవితపరమావధి**

తనను తాను తెలుసుకోటానికి ప్రయత్నం చేసినప్పుడు ఎంతైనా తన తత్వము అర్థమవుతుంది. 'ఎచ్చటపుట్టె నచ్చటకేగుట నైజము ప్రాణికోటికిన్'. సూర్యుని కాంతిచేత సముద్రజలమంతా ఆవిరిగా మారిపోతుంది. ఈ ఆవిరిగా మారినప్పుడు సముద్రముయొక్క ఉప్పురుచి ఆవిరిలో ఉండదు. అక్కడ మధురంగా మారిపోతున్నాది. ఆ ఆవిరియే మేఘములుగా రూపొందుతున్నాది. ఈ మేఘములపై చల్లటిగాలి వీచినప్పుడు వర్షబిందువులు పడుతున్నాయి. ఈ వర్షబిందువులు ఒక దానితో ఒకటి చేరి చిన్న ప్రవాహముగా రూపొందింది. ఈ చిన్న చిన్న రూపములన్నీ చేరి పెద్ద నదిగా ప్రవహిస్తుంది. ఈ పెద్దనది ఎక్కడకు పోయి చేరుతున్నాది? తిరిగి సముద్రములో పోయి చేరుతున్నాది. అదే purpose of life. అనగా జీవితపరమార్థము. మరొక ఉదాహరణము. ఒక కుమ్మరి ఒక చెరువుకు వెళ్లి బండిలో మట్టి తీసుకువచ్చాడు యింటిముందు పోసుకున్నాడు. ఆ మట్టిని చెరువులో తవ్వినప్పుడు అక్కడ గుంట ఏర్పడింది. తన యింటిముందు పోసుకున్నప్పుడు గుట్టగా రూపొందింది. గుంటమట్టే గుట్టమట్టి. గుట్టమట్టే గుంటమట్టి. గుంత దిగాలి. గుట్ట ఎక్కాలి. దినదినము పాత్రలు చేస్తూరాగా గుట్టకూడా తరిగిపోతూ వచ్చింది. మట్టిగుట్ట క్షీణించిపోయింది. పాత్రలు చేసి సంస్కరింప చేశాడు. ఆ మట్టి పాత్రలో నీరుపోస్తే పగిలిపోతుంది. కనుక అగ్నిలో వేసి సంస్కరింపజేశాడు. అగ్నిలో వేసి కాల్చేటప్పటికి నీరుపోస్తే నిల్చిపోతున్నాది. పచ్చిగా ఉండినప్పుడు వేసిన నీరంతా క్రిందకు పోతున్నది. పాత్రకూడా విరిగిపోతున్నాది. సంస్కరింపబడిన తరువాత ఆ పాత్రలో నీరు నిల్చిపోతున్నాది. దానిని అనేక విధములుగా మనము ఉపయోగించుకుంటున్నాము. కానీ,



srisathyasaivachanamrutam

అదే కుండ బావినుంచి నీరు తెస్తున్నప్పుడు చేయి జారి క్రిందపడిపోయింది. ఆ ముక్కలు మనం తీసుకుపోతామా? లేదు అక్కడే వదలిపోతాం. ఆ ముక్కలపైన లారీలు, బస్సులు, కార్లు, మనుషులు అన్ని విధాలా తొక్కటంచేత కట్టకడపటికి తిరిగి మట్టిగా తయారౌతుంది. 'ఎచ్చటపుట్టె నచ్చటకేగుట నైజము ప్రాణికోటికిన్'. ఈ పాత్రలన్నీ మట్టినుండే వచ్చాయి. కట్టకడపటికి తమ రూపాన్ని మరచిపోయి తిరిగి మట్టిలో చేరిపోయాయి. కనుక, ఎక్కడనుండి వచ్చావు? ఎక్కడికి పోవాలి? అని ఎవరిని అడగనక్కరలేదు. ఎక్కడనుండి వచ్చావో అక్కడకు పో! పురందరదాసు చెబుతున్నాడు, 'నిన్ను మరచిపోవటంచేతనే ఈ ధరకొచ్చి పడిపోయాను. నిన్ను మరచిపోకుండా ఉంటే నేను యిక్కడ పుట్టి ఉండేవాడిని కాదు. నిన్ను మరచిపోటమే నేను యిక్కడ పుట్టటానికి మూలకారణము. నన్ను పోషించలేవా? కొండ పైభాగములో రాతిపై పుట్టిన చెట్టుకు నీరుపోసి కాపాడుతున్నవారు ఎవరు? అంతా నీవే!' మన compound లో మొక్కపెట్టి నిత్యము కావలసిన ఎరువు వేసినా అది పెరగదు. కానీ కొండపైన ఉన్న చెట్టు ఎంత క్షేమంగా పెరుగుతున్నాది! 'అది భగవంతునియొక్క అనుగ్రహము స్వామీ! నెమలికి ఇన్ని రంగులు వేసినవారు ఎవరు? పచ్చని చిలుకకు ఎఱ్ఱని మూతి పెట్టావు. ఎంత అందంగా ఉంటున్నాది! ఎవరు వేశారు, ఈ పెయింటు? అంతా నీదే. నేనెందుకు బీదవాడినౌతాను. ఓ శ్రీనిధీ! నీవు ప్రక్కనున్నంతవరకు నేనెందుకు బీదవాడినౌతాను? నాకు విద్య చెప్పేవాడు నీవే. నాకు బుద్ధి చెప్పేవాడు నీవే, శ్రేష్ఠమూర్తి...! పెట్టిలోనున్న అష్టాభరణాలు నీవు యిచ్చినవే! ఆకాశము వచ్చి నా తలపై కూలినా నేను భయపడను. అన్నింటికి నీవు ఉన్నావు. నీవు నా వెంటనే, యింటనే, జంటనే ఉంటుండగా నా కెందుకీ భయము? నేను ఎక్కడా పోనక్కరలేదు. నీవు నా వెంట ఉన్నావు, అనే విశ్వాసము రావాలి. ఆ విశ్వాసమున్నవానికి ఎట్టి భయము ఉండదు. ఎట్టి కొరత ఉండదు. ఏ విధమైన బీదరికమురాదు. ఎందుకంటె శ్రీనిధియైన నీవే నా అండగా ఉండగా నాకేమి భయము? అన్ని నీవే చేస్తున్నావు. నేనొక ఆట బొమ్మను'. ఈ విధంగా మన కర్తవ్యము మనం నిర్వర్తించుకుంటూ పోవాలి.

**అహంకార, మమకారములనే గోడలు తీసివేసినప్పుడు భగవత్సాక్షాత్కార మవుతుంది**



srisathyasaivachanamrutam

అంతా దైవమే యిస్తున్నాడు. అహంకారమునకు అవకాశము యివ్వకూడదు. జగత్తంతటికి ప్రకాశము యిచ్చే సూర్యుడు మన యింటిలో ప్రవేశించ లేదే అని విచారించటం ఎంత బుద్ధి తక్కువ! 'ప్రపంచమునకంతా వెలుతురు ఇస్తున్నాడు. కానీ, నా యింటిలో ఎందుకు రావటంలేదు' అని బాధపడటం తెలివితక్కువ. అప్పుడు సూర్యుడుకూడా ఫక్కున నవ్వాడట! 'ఓ పిచ్చి మానవా! అహంకార, మమకారములనే గోడలు కట్టుకున్నావు. అభిమానమనే కప్పును వేసుకున్నావు. నేను నీ యింటికి ఎట్లా వచ్చేది? నీవు అభిమాన, అహంకారములనే గోడలు కొట్టివేయి. మమకారమనే టాపును తీసివేయి. సీదా లోపలకు దిగుతాను. నీవు పిలువనక్కరలేదు. నీవు నాకు ఆహ్వానము పంపనక్కరలేదు. నన్ను నీవు ప్రార్థించనక్కరలేదు. It is my duty, I will come నేను తప్పక వస్తాను' అంటాడు. అదే విధముగా భగవంతుడు నీ హృదయములోకూడా ఉన్నాడు. కానీ రాలేదే అని అనుకుంటున్నావు. కారణం ఏమిటి? ఈ అహంకారమమకారములు, దేహాభిమానములను ఎక్కువగా పెట్టుకున్నావు. మమకారమనే పెద్ద టాపు వేసుకున్నావు. భగవంతునిలోపల బంధించినావు. భగవంతుడు నీకు ఎట్లా కనిపిస్తాడు? నీలోనే ఉన్నాడు; కానీ కనిపించడు. రామదాసుకూడా చెప్పాడు.

**అడుగుదాట కదలనివ్వను**
**నాకభయమివ్వక నిన్ను విడవను ।రామ।**

'నిన్ను ఒక్క అడుగైనా ముందుకు పోనివ్వను', అని గట్టిగ పట్టుకున్నాడు. 'ఎక్కడ నన్ను వదలిపెట్టిపోతావు? అని గట్టిగా నిలదీశాడు. అప్పుడు భగవంతుడు చెబుతున్నాడట: 'పిచ్చివాడా నేను బయట ఉంటేకదా, వదలిపెట్టిపోవటం! లోపలనే ఉన్నాను. నీయందే ఉంటున్నాను. నీవు నేనుగానే ఉన్నాను. నేను నీవుగానే ఉన్నావు. కనుక వదలిపెట్టి పోవటమనేది నీ భ్రాంతి' అన్నాడు. భగవంతుడు ఎవరిని వదలటంలేదు. ఎక్కడా పోవటంలేదు. ఉన్నచోటే ఉన్నాడు. సర్వత్రా తానే ఉన్నాడు. అదే మొన్న ఒకసారి చెప్పాన,. 'వేయబోవని తలుపు'. జీవుడు 'అయ్యో నేను వంటరిగా ఉంటున్నాను ఎవరైనా వచ్చి యిందులో ప్రవేశిస్తారేమోనని, లోపలనుంచి ఒక విధమైన జీవభ్రాంతి 'వేయబోవని

sri sathyasai vachanamrutam

తలుపు', 'తలుపు వేసుకో' అంటున్నాది.

### భగవంతుడులేని స్థానము ఎక్కడా లేదు

భగవంతుడు చెబుతున్నాడు 'తీయమంటూ పిలుపు, జీవుడెందుకో నవ్వుకొలుపు'. 'విశ్వమంతా ప్రాణ విభుని మందిరమైన వీధివాకిలి ఏదటో'. విశ్వమంతా మందిరముగా వుండినప్పుడు వీధివాకిలి ఎందుకు? వేరే ఒక ప్రదేశము ఉంటే దానికి వీధివాకిలి పెట్టుకోవచ్చు. భగవంతుడు లేని స్థానము ఎక్కడా లేదు. ఈగపోవటానికి స్థానమేలేదు. వీధివాకిలి ఎందుకు? అప్పుడు చెప్పుతున్నాడు జీవుడు! 'వీణతంత్రులు మీటి, ప్రాణతంత్రులు నాటి, ఆనంద బాష్పములు ఆత్మార్పణము జేయ, కైలాసమే చూడరా ఓ జీవా! వీధివాకిలుంది యేరా!' 'వేయబోవని తలుపు తీయమంటూ పిలుపు'. తలుపు, పిలుపు రెండింటికి మధ్యలో ఉంటున్నాది, ఈ సందేహము. వేయబోయేది జీవుడు. తీయమనేది దేవుడు. కదిలేది జీవుడు, నిల్చేవాడు దేవుడు. కదలనివాడే దేవుడు, కదిలేవాడే జీవుడు. ఒక పిట్ట లేతకొమ్మపై వాలినప్పుడు కొమ్మ అటుయిటూ ఊగుతుంది. కానీ చిన్న పిట్ట భయపడదు. ఎందుకంటే అది కొమ్మను ఆధారము చేసుకోలేదు. తన రెక్కలను ఆధారం చేసుకుంది. ఒక పిట్టకు తన రెక్కలపైనున్న విశ్వాసముకూడా ఈనాడు మనిషికి లేకుండా పోతున్నాది. ఏ కించిత్ కష్టమో, ఏకించిత్ బాధయో, ఏ కించిత్ విచారమో వస్తే అదిరిపోతున్నాడు మనిషి. పిరికి మనిషి. అలాంటి పిరికి మనిషి మనం కాకూడదు. మనము దైవ చింతన కలిగిన హృదయము కలవాడు కావాలి.

### దైవబలము, ధర్మబలము కావాలి

భుజబలము, బుద్ధిబలము కాదు, కావలసింది. దైవబలము, ధర్మబలము రెండూ కావాలి.

**భుజబలంబు మంచి బుద్ధిబలంబుండియు**
**దైవబలంబులేక దీనుడగును**
**కర్ణుడంతటివాడు కడపటికేమయ్యె**
**మరువబోకుడిట్టి మంచిమాట.**

srisathyasaivachanamrutam

ఎంత భుజబలము, ఎంత బుద్ధిబలము ఉన్నాయి కర్ణునికి! సత్యము చెప్పాలంటే అర్జునునికంటె గొప్పవాడు కర్ణుడు. సాక్షాత్ సూర్యునియొక్క ప్రసాదము. అలాంటి కర్ణుడు తన భుజబలము, బుద్ధిబలముపై ఆధారపడ్డాడు. ఎందుకోసం? అభిమానము. ద్రౌపదీ స్వయంవరం జరుగుతున్నాది. కర్ణుడు విలువిద్యలో ప్రవీణుడు. అతను మత్స్యయంత్రము కొట్టడానికి వెళ్లాడు. తెరవెనుకనున్న ద్రౌపది చెప్పింది, 'క్షత్రియుడైనా కావాలి లేదా రాజైనా కావాలి. వారు మాత్రమే మత్స్యయంత్రము కొట్టటానికి అర్హులౌతాడు' అని. అవమానముగా వెనుకకు తిరిగి వచ్చాడు. ఆ సమయంలో అతను సూతకుమారుడు. తాను క్షత్రియుడు కాడనుకున్నాడు. అలాగే రాజుకాడు. ఫలితంగా రెండింటికి అర్హతలేదు. మత్స్యయంత్రము ఛేదించే శక్తి తనకు ఉన్నది. కాని, తగిన అర్హత లేదు. అప్పుడు దుర్యోధనుడు వచ్చాడు. ఆనందంగా తన అంగ రాజ్యానికి కర్ణుని అధిపతిని చేశాడు. ఆ అభిమానంచేత దుర్యోధనుడు చెడ్డవాడని తెలిసికూడా అతనికి దాసుడయ్యాడు. అభిమానమును ఎలాంటి పరిస్థితిలోనైనా ధిక్కరించవలసిందే! చెడ్డవాడు చెడ్డవాడే! రాజైనా కానీ చెడ్డవానితో చేరకూడదు. 'వీని సహాయము నాకెందుకు, సర్వులకు సహాయం చేసే భగవంతుడు నాకుకూడా చేస్తాడు' అనే భావము, ఆ త్యాగము లేకపోయింది, కర్ణునికి. రాజ్యపట్టాభిషేకము చేశాడు కదాయని లొంగిపోయాడు. దుష్టచతుష్టయములో ఒకడైపోయాడు. వారే దుర్యోధన, దుశ్శాసన, శకుని, కర్ణులు. ఈ సత్యము ద్రౌపదికి తెలుసు, ముందే! కుంతీదేవి కుమారుడే! అతను తన ఆరవ భర్త అని ముందుగా తెలుసు. ధర్మరాజుకంటె పెద్దవాడు.

### ద్రౌపదియొక్క క్షమాగుణమును అందరూ అలవరచుకోవాలి

సర్వధర్మస్వరూపిణి ద్రౌపది. లోకులు కాకులు. ఐదుమంది భర్తలుంటే పతివ్రత అంటారు. కాని ప్రపంచము తలచినట్లుగా ఐదుగురు పురుషులుకాదు, ఆమె భర్తలు. పంచభూతములే ఐదుగురు భర్తలు. ఒకానొక సమయంలో 'లోకములో ఎవరు పతివ్రత? రుక్మిణియా, సత్యభామా లేక యింకా ఎవరు' అనే ప్రశ్న వచ్చింది. ఒక్కటే జవాబు చెప్పాడు, ఆ సభలో కృష్ణుడు.

srisathyasaivachanamrutam

**పతుల మాటకు ఎదురు చెప్పంగబోదు**
**వారి సేవలు చేయగా తీరదనదు**
**తనకునున్నట్టి దానితో తృప్తిగనును**
**ద్రౌపదికి సాటి ఏ పతివ్రతయు లేదు.**

మూడు గుణములు ఆమె యందుంటున్నాయి. అంత క్షమాగుణము కల్గినది, ద్రౌపది. అశ్వత్థామ వచ్చి నిద్రపోతున్న కుమారులను గొంతు కోశాడు. పోయి చూచింది, ద్రౌపది. గుండె పగిలిపోయింది. ఐదుమంది పుత్రుల దేహములు వేరుగా, గొంతులు వేరుగా ఉంటున్నాయి. పట్టలేని దుఃఖముతో అర్జునుని దగ్గరకు పరుగెత్తి వచ్చింది. 'ఈ పని చేసింది ఆ బ్రాహ్మణుడు, మహా దుర్మార్గుడు, వాని పట్టి తీసుకువస్తాను' అన్నాడు అర్జునుడు. 'బ్రాహ్మణుడు ఈ పని చేయవలసింది కాదు. పైగా గురుపుత్రుడా ఈ పని చేయవలసింది'. అని అశ్వత్థామను పట్టి తెచ్చాడు. ఆ సమయంలో ద్రౌపది చూపించినది ఎంతటి క్షమాగుణమో అందరు గుర్తించాలి. ఈ క్షమాగుణము తప్పక మన జీవితములో పెట్టుకోవాలి. ఆమె అశ్వత్థామను చూసి పరుగెత్తి పాదాలపై పడింది. ఏమని చెప్పింది?

**పరగన్ మా మగవారలందరును మున్ బాణప్రయోగోపసం**
**హరణాద్యాయుధ విద్యలన్నియును ద్రోణాచార్యుచే నభ్యసిం**
**చిరి పుత్రాకృతినున్న ద్రోణుడవు నీ చిత్తంబులో లేశమున్**
**గరుణాసంగము లేక శిష్యసుతులన్ ఖండింపగా బాడియే!**

అంతేకాదు

**ఉద్రేకంబున రారు శస్త్రధరులై యుద్ధావనిం లేరు కిం**
**చిద్ద్రోహంబును నీకు చేయరు బలోత్సేకంబుతో చీకటిన్**
**భద్రాకారుల పిన్న పాపల రణప్రౌఢక్రియాహీనులన్**
**నిద్రాసక్తుల సంహరింపనకటా నీ చేతులెట్లాడెనో!**

చూచాడు, భీముడు. కోపముతో ముందుకు దుమికాడు



srisathyasaivachanamrutam

**కొడకులపట్టి చంపెనను కోపమునొందదు బాలఘాతకున్**
**విడువుమటంచు చెప్పెడిని వెఱ్ఱిది ద్రౌపది వీడు విప్రుడే**
**విడువగనేల చంపుడటు వీనిని మీరలు చంపరేని నా**
**పిడికిటి పోటునన్ శిరము భిన్నము చేసెద చూడుడందరున్.**

'కొడుకులు పోయినారని ద్రౌపదికి పిచ్చిపట్టిపోయింది. లేకపోతే ఈ పాపుని పాదములు పట్టటమా? విడువుము. నా పిడికిటితో వాని తల బ్రద్దలు చేస్తాను' అని ఉద్రేకముతో ఊగిపోయాడు. అప్పుడు ద్రౌపది మంచి శాంత వచనములు చెప్పింది. అర్జునుడుకూడా 'నా మాట తప్పిపోతుంది. కాబట్టి వీనిని క్షమించటానికి వీలుకాదు' అని నిర్ణయించాడు. అప్పుడు ఆమె కృష్ణుని ధ్యానించింది. ఒక ఉపాయమార్గం చెప్పింది:

**విశ్వస్తుత్యుడు శక్రసూనుడు మహావీరుండు ఘోరాసిచే**
**నశ్వత్థామ శిరోజముల్దరిగి చూడాంతర్మహారత్నమున్**
**శశ్వత్కీర్తి వెలుంగబుచ్చుకొని పాశవ్రాత బంధమ్ములన్**
**విశ్వాసంబుననూడ్చి త్రోచె శిబిరోర్వీభాగము బాసిపోన్.**

ఇంకా ఇలా బోధించింది:

**వెఱచినవాని దైన్యమున వేదననొందినవాని నిద్ర మై**
**మఱచినవాని సౌఖ్యమున మద్యము ద్రావినవాని భగ్నుడై**
**పఱచినవాని సాధుజడభావమువానిని కావుమంచు వా**
**చఱచినవాని కామినిన్ చంపుట ధర్మముకాదు అర్జునా!**

'చేతికి చిక్కినాడని ముక్కలు చేయటం మంచిదికాదు. ఇది మన క్షత్రియ ధర్మమునకే విరుద్ధమైనది. నా కొడుకులను చంపితే నాకు ఎంత బాధగా ఉంటుందో ఆ అశ్వత్థామను చంపితే అతని తల్లికూడా నావలె బాధ పడుతుంది కదా! మరణించిన నా కుమారులు ఎట్లైనా మరణించారు. ఇంక ఏ విధముగానైనా నా కుమారులు తిరిగిరారు. మరొక తల్లిని ఎందుకు బాధ పెట్టాలి? ఆపండి', అని చెప్పింది. ద్రౌపదియొక్క ప్రధానమైన గుణము, క్షమాగుణము. పాండవులనందరిని కట్టకడపటివరకు రక్షించి, పోషించి కీర్తి జగత్తంతా

sri sathyasai vachanamrutam

వ్యాప్తిగావింపచేసింది ద్రౌపది. ఇల్లు ఇల్లాలిపై ఆధారపడి ఉంటుంది. ప్రతి స్త్రీ క్షమాగుణమును పెంచుకోవాలి. పురుషులుకూడా పెంచుకోవాలి. కానీ స్త్రీకి ఇది చాలా ప్రధానమైన గుణము. ఆ క్షమాగుణముతో ఎంతైనా సాధించవచ్చును. క్షమాగుణమే దైవగుణము. దైవముయొక్క gift.

'మంచి జరిగితే good for me, bad జరిగితేకూడా good for me. రెండూ మన మంచికోసమే' అనుకోవాలి. ఇది ఉత్తమమైన బ్రహ్మతత్త్వము. ఆ విధమైన పవిత్రమైన, విశాలమైన, అనంతమైన భావము మనలో ఉండినప్పుడు అంతా మనకు విజయమే, విజయమే! జీవితమంతా జయప్రదంగా జరిగిపోతుంది.

**(తేదీ 29-08-1996న కుల్వంత్ హాలులో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam